ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర

## (పిప్పరలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 20.10.96)

ప్రియమైన ఆత్మ బంధువుల్లారా,

మానవుడికి సంపద ఒక్కటే సరిపోదు. విద్య, సదాచారము ఉండాలి. ఒక్క సంపద ఉంది అనుకోండి. విద్య, సదాచారము లేకపోతే సమగ్రత రాదు. దేవిని మూడు రూపాలలో ఆరాధిస్తారు. సదాచారం కావాలని దుర్గను, విద్య కావాలని సరస్వతిని, సంపద కావాలని లక్ష్మిని ఆరాధిస్తారు. మనిషికి ఇవి అన్నీ అవసరము. దేవి అంటే జ్ఞానం, పరాశక్తి. దేవిని ఆరాధించటం వలన మన మనస్సు అంతర్ముఖమవుతుంది. నిజమైనశక్తి మన హృదయంలోనే ఉంది. మన మనస్సు అంతర్ముఖమయినపుడు ఆ పరాశక్తి మన మీద అనుగ్రహం చూపించి మనలను లోపలకు గుంజుకొంటుంది. ఎప్పుడైతే లోపలకు గుంజుకుందో అప్పుడు మనలోని జీవలక్షణాలు నశిస్తాయి. ఆత్మదర్శనం అవుతుంది. హిందూసాంప్రదాయంలో భగవంతుడిని పురుషుడు గానే కాకుండా ఎక్కువగా తల్లిగా పూజిస్తారు. తల్లిగా ఆరాధించటం వలన ఎక్కువ చనువు ఉంటుంది. రామకృష్ణుడు కాళిని ఆరాధించి మహాజ్ఞాని, మహాగురువు అయ్యాడు.

మనం ఏదైనా ఆలోచించినప్పుడు సమగ్రంగా ఆలోచించాలి. కొంతమంది ఆలోచించేటప్పుడు అటు, ఇటు ఒరిగి పోతారు. నిదానంగా ఆలోచించలేరు. నిదానంగా, సమానంగా ఆలోచించగలిగితే వివేకం పెరుగుతుంది. మన మనస్సు అంతర్ముఖం అవుతుంది. మనస్సు అంతర్ముఖం అవుతూ ఉంటే మనకు చల్లదనం కలుగుతుంది. మీదేహం ఎక్కడ ఉన్నా, మనస్సును ఆత్మలో ఉంచండి, మనస్సును ఆత్మలో ముంచండి.

మనం ఏ పరమేశ్వరుడి గురించి అయితే వెతుకుచున్నామో వాడు మనకు బాహ్యంగాలేడు, మన మనస్సు యొక్క మూలంలోనే ఉన్నాడు. ఎక్కడో ఏదోక్షేత్రంలో, ఏదో దేహంలో జ్ఞానమును పొందుతాము అని అనుకోవద్దు. అది మన హృదయంలోనే ఉంది. ఏనాటికైనా, ఏ జన్మలోనైనా, జ్ఞానం యొక్క అనుభవం, భగవదనుభవం మన హృదయంలోనే పొందాలి. యాత్రలు అన్నీ తిరగటం ఎందుకంటే అక్కడ ఏమీలేదు, ఉన్నది అంతా మన హృదయంలోనే ఉందని తెలియటం కోసం.

భగవంతుడు అంతటా వ్యాపించి ఉన్నాడు. అంతటా వ్యాపించి ఉన్నదేవుడిని ఒకచోట ఉన్నాడు, వేరొకచోటలేడు అని చెపితే ఆయన సర్వవ్యాపకత్వాన్ని అగౌరవపరచినట్లే. ఇతర చింతలు లేకుండా ఎవడైతే నిరంతరం నన్నే చింతిస్తున్నాడో, అంతటా నన్నే,ఎవడైతే చూస్తున్నాడో, ఎవడైతే నన్నే గమ్యంగా పెట్టుకొన్నాడో వాడి యోగాన్ని, క్షేమాన్ని నేనే చూస్తాను అని భగవంతుడు చెపుతున్నాడు. భగవంతుడు ఉన్నడా లేడా అనే అనుమానం పెట్టుకోవద్దు. భగవంతుడు ఉన్నాడని స్థిరనిశ్చయం ఉంటే వాడు భక్తుడుతో, సాధువుతో సమానము. నిరంతరము భక్తిభావన వలన మనస్సు కరిగిపోతుంది. నీవు నేను, నేను అంటున్నావు కదా ఆ నేను యొక్క మూలం తెలిస్తేగాని, దేవుడు ఎవడో నీకు తెలియదు అంటున్నారు భగవాన్. ఆ నేను యొక్క మూలం నీకు ఏ జన్మలో తెలిస్తే అప్పుడు నీకు దేవుడు తెలుస్తాడు. మీరు ఏ వృత్తిలో ఉన్నా పొందవలసిన గమ్యమును దృష్టిలో ఉంచుకోవాలి. సమాజంలో నలుగురిలో ఉండాలని లేదు, కొండగుహలో కూర్చొని ధ్యానం చేసుకోవాలని ఉంది అని ఒకరు భగవాన్ ను అడిగారు. నీవు కొండగుహలో ఉన్నా, సమాజంలో ఉన్నా, చైతన్యమును పొందాలి. ఆ చైతన్యమును పొందటానికి ప్రయత్నం చేయకుండా, నేను కొండగుహలో ప్రయత్నం చేస్తాను అని

ఇటువంటి తలంపులు పెట్టుకుంటే ఈ తలంపులే నీకు పునర్జన్మలు తీసుకువస్తాయి. పొందవలసిన వస్తువు ముఖ్యంగాని నీవు ఎలా సాధన చేస్తున్నావు, ఎక్కడ ఉండి సాధన చేస్తున్నావు అన్నది ముఖ్యం కాదు.

జ్ఞానం పొందటానికి ఒక్కవిచారణయే సాధన మంటారా అని భగవాన్‌ను ప్రశ్నిస్తున్నారు. ఒక్క విచారణామార్గమే కాదు. మీరు భగవంతుని నామాన్ని స్మరించుకోవచ్చు, రూపాన్నిధ్యానించుకోవచ్చు, తపస్సు చేసుకోవచ్చు. ఒక్క విచారణామార్గములోనే వస్తువు తెలుస్తుంది, మిగతామార్గాలలో తెలియదు అనికాదు. మీకు ఇష్టమైన మార్గములో ప్రయాణం చేయండి. నిదానంగా నీమనస్సులో ఏమి జరుగుతోందో పరిశీలన చేస్తే, దాని మూలాన్ని వెతుకుతూవుంటే నీమనస్సులో ఉన్న గుణాలు నశిస్తాయి. అప్పుడు నీవు పునర్జన్మలేని స్థితికి ఎదికిపోతావు. పుట్టినవాడిని చావు తరుముకొంటూవస్తుంది, చనిపోయినవాడిని పుట్టుక తరుముకొంటూవస్తుంది. రాగద్వేషలతో ఉన్నంత కాలం ఈ ద్వంద్వాలలో ఊగిసలాడుతున్నంత కాలం ఈ జననమరణ ప్రవాహము నుండి బయటపడటానికి అవకాశం లేదు. పునర్జన్మకు కారణములు నీమనస్సులో వున్నాయి. నీవు పూజచేసినా, జపం చేసినా, యాత్రలు చేసినా నీ మనస్సులో ఉన్న పునర్జన్మహేతువులు నశిస్తేగాని జననమరణ ప్రవాహము నుండి బయట పడలేవు.

మాట, మాటకు చిరాకు వస్తూ ఉంటే, కోపం వస్తూ ఉంటే మీలోపల దోషం ఉంది అని గుర్తు. ఆ దోషాలు ఏమిటో మీరు వెతికి పట్టుకోవాలి. మీరు సాధన చేస్తే గురువుఅనుగ్రహం కలుగుతుంది. అప్పుడు ఆ దోషాలను తీసి మంటపెట్టవచ్చును. మాకు భక్తి ఉంటే సరిపోతుంది అని కొంతమంది అంటారు. దాని అర్థం ఏమిటీ అంటే భక్తికి ముక్తి దాసి వంటిది. ఎక్కడయితే భక్తి ఉందో అక్కడ ముక్తి వచ్చి తీరుతుంది. యజమాని కంట్రోలులో దాసి ఎలాఉంటుందో అలాగే భక్తి చేతిలో ముక్తి ఉండవలసిందే. మీకు భక్తి కలిగితే ముక్తి మీవెంట పడుతుంది. ఆ భక్తి మీకు జపం వలన కలుగుతుంది. మీకు ఇష్టమైన భగవంతుని రూపంతోనూ, నామంతోనూ మానసికఅనుబంధం పెట్టుకోండి. అప్పుడు మీ మనస్సు పవిత్రం అవుతుంది, ఆత్మాకారం చెందుతుంది. మీరు ఆత్మ అవుతారు.

ప్రపంచంలో ఎంత అశాంతి ఉంటే మీకు ఏమిటీ? ఎన్నిగొడవలు ఉంటే మీకు ఏమిటీ? నిప్పు ఎంత పెద్దది అయిన మీరు ముట్టుకొంటే కాలుతుంది గాని దానిని ముట్టుకోకపోతే కాలదు. అదే విధంగా ప్రపంచంలో ఎంత అశాంతి ఉన్నా, ఎన్ని గొడవలు ఉన్నా, మీరు అందులో కలిసిపోతే అశాంతి వస్తుంది గాని అందులో కలవకుండా ఈశ్వరుని ధ్యానం చేస్తూఉంటే ప్రపంచంలో ఉన్న అశాంతి, అలజడి మిమ్మల్ని ముట్టుకోవు. ప్రపంచంలో అశాంతి వుంది, పరిస్థితులు బాగాలేవు. అందువలన భక్తి కుదరటం లేదు అంటే ఇవి అన్నీ వంకరమాటలు. లోపల పట్టుదల లేక, వస్తువును పొందాలనే కాంక్ష లేక ప్రపంచం అలా వుంది, ఇలా వుంది అని వంపులు చెప్పటం. ఏ వస్తువును పొందాలను కొంటున్నావో మొదట దానిని ప్రేమించాలి దానిని తెలుసుకోహలనే కాంక్ష మీహృదయంలో నుండి రావాలి. ఆ వస్తువును మీరు ఎంతగా ప్రేమిస్తున్నారో దానికి తెలుస్తుంది. ఆవస్తువును ధ్యానించగా, ధ్యానించగా దానినే గమ్యంగా పెట్టుకొని దానిని తెలుసుకోవటానికి కృషి చేస్తే అది మీ హృదయంలో ఉంది కాబట్టి మీ హృదయంలోనే సాక్షాత్కారమవుతుంది. సాధన చేయగా చేయగా దేనినయితే తెలుసుకోవాలని నువ్వు అనుకొంటున్నావో అదే నువ్వైపోతావు. సాధన వలన సిద్ధి కలుగుతుంది. సాధన అంటే విచారణ ఒక్కటే కాదు జపం చేయవచ్చు, ధ్యానం చేయవచ్చు, నా దేహం, నా మనస్సు, నా తెలివితేటలు ఇవన్నీ నావే అంటే అది శరణాగతి కాదు. నామనస్సు, నాదేహం , నాయొక్క సర్వస్వం నీదే అన్నవాడు శరణాగతి చెందగలడు. పైకి అంతా నీదే అని చెప్పి లోపల అంతా నాదే అనుకుంటే, అది శరణాగతి కాదు. అంతా నీదే అని హృదయపూర్వకంగా ఈశ్వరుని పాదాలను ఎవడైతే ఆశ్రయించాడో అది శరణాగతి. శరణాగతే నిజమైనగతి. విచారణ వలన, శరణాగతి వలన కూడా నేను నశిస్తుంది.

గురువు ఏమిచేస్తాడు అంటే వారి మానసిక ప్రవృత్తిని బట్టి కొంతమందికి ధ్యానం చేసుకోమని, కొంతమందికి జపం చేసుకోమని, కొంతమందికి విచారణ చేసుకోమని చెపుతాడు. వారి మానసిక ప్రవృత్తిని బట్టి చెపుతాడు, కాని అన్ని మార్గముల యొక్క గమ్యం జ్ఞానమే. మేము జపం చేసుకొంటున్నాము అని భగవాన్‌తో అంటే సరి సరి చేసుకోండి అని కొంతమందితో అనే వారు. ఆ జపం చేసే జపి ఎవరు? వాడిని పట్టుకోండి అని కొంతమందికి చెప్పేవారు. వచ్చిన వారి అర్హతను బట్టి, యోగ్యతను బట్టి చెప్పేవారు. మబ్బు ఉన్నప్పుడు సూర్యుడు కనబడడు. మబ్బు కనబడుతుంది. దాని వెనకాల సూర్యుడు ఉన్నాడు. సూర్యుడు వెలుతురువలన ఆ మబ్బు మనకు కనబడుతోంది. ఎవడి వెలుతురు వలన మనకు మబ్బు కనబడుతోందో ఆ సూర్యుడు లేడు అని నీవు అంటున్నావు. ఒక పరాశక్తి ఈ సృష్టి అంతా వ్యాపించి ఉంది. ఆ పరాశక్తి వ్యాపించటం వలన ఈ సృష్టి అంతా మనకు కనబడుతోంది. ఈ సృష్టి కనబడటానికి ఏ శక్తి కారణమో నీకు తెలియక పోవటం వలన ఆ శక్తి లేదని నీవు అనుకొంటున్నావు. అంతటా వ్యాపించి ఉన్న వస్తువును తెలుసుకోవటానికి సాధన అక్కరలేదు. ఆ వస్తువును తెలుసుకోవటానికి ఏ బలహీనతలు అయితే అడ్డువస్తున్నాయో ఆ బలహీనతలు తొలగించుకోవటానికి సాధన అవసరము.

పూర్వజన్మలో నీ స్వరూపానికి దూరమయ్యే పనులు నీవు చేసావు. అవే నీ మనస్సులో బీజాలుగా పడి వున్నాయి. నీ స్వరూపాన్ని తెలుసుకోవటానికి ఈ కర్మబీజాలు అడ్డువస్తున్నాయి. నీకు తెలుసున్నా, తెలియక పోయినా వస్తువు ఉంది. తెలుసుకొంటే సుఖపడతావు. తెలియకపోతే జన్మ జన్మలకు దుఃఖం, అశాంతి, ఆందోళన నిన్ను వెంటాడుతుంది. నీవుచేసే ప్రతీ పనికి సమాధానం చెప్పిస్తుంది. నీవు ఏ జన్మలో ఉన్నా, నిన్ను తరుముకొంటూవచ్చి నీ చేత సమాధానం చెప్పిస్తుంది. ఈ ప్రకృతి గుణాలను పోగొట్టుకొని హృదయంలో ఉన్న వస్తువును తెలుసుకొన్నావా నిన్ను కర్మ సిద్ధాంతము ఏమీ అంటదు. అప్పుడు నీవు సుఖివి అవుతావు. అక్కరలేని గొడవలు వదులుకో. అప్పుడు ఈశ్వరుడు నీకు తానుగా వ్యక్తమవుతాడు. ఒక్క ఆత్మగురించి తప్పించి, చైతన్యం గురించి తప్పించి మిగతా గొడవలు మిమ్మల్ని ఎవరు ఆలోచించమన్నారు అంటున్నారు భగవాన్. వీటి గురించి ఆలోచించమని భగవంతుడు మీకు చెప్పటం లేదు. మీలో ఉన్న మాయే, దోషమే ప్రకృతిగుణాలను గురించి ఆలోచింపచేస్తున్నాయి. ఇతర భావనలు లేకుండా నిరంతరము నన్నే చింతించమని భగవంతుడు చెబుతున్నాడు. అన్యభావనలేకుండా, అనన్యభావనతో ఉండమని అడుగుతున్నాడు. తననే భావన చేయమని అడిగినపుడు ఇతర భావనలు చింతించమని ఎవరు అడుగుతున్నారు, నిన్నుఎవరూ అడగడంలేదు. నీ బలహీనతల వలన నీవు ఆ విషయాలను ఆలోచిస్తున్నావు.

వచ్చేది, పోయేది నీవు కాదు. ఎప్పుడూ ఉండేదే నీవు. ఈ గౌరవాలు, అగౌరవాలు, రాబోయే జన్మకు కారణాలు, మంచిచెడ్డలు అన్నీ మనస్సులో ఉన్నాయి. మనస్సు నుండి విడదీసి వీటిని వేరుగా మనం చూడలేము. మనస్సు నశిస్తే ఇవి అన్నీ నశిస్తాయి. మనిషి ఏ విధంగా పాతబట్టలు వదిలేసి కొత్తబట్టలు వేసుకొని తిరుగుతున్నాడో అదే విధముగా జీవుడు కూడా పాత శరీరాలను వదిలేసి కొత్తశరీరాలు వేసుకొని తిరుగుతున్నాడు. జీవుడు తనమూలాన్నీ ఎప్పుడైతే తెలుసుకొన్నాడో అప్పుడు దేహాలను ధరించవలసిన పనిలేదు. దేహం ఉన్నవాడికి బట్టలు కాని దేహమేలేని వాడికి బట్టలు ఏమిటి ? అలాగే జీవలక్షణాలు ఉన్నవాడికి దేహంగాని జీవలక్షణాలు లేనివాడికి దేహంతో పనిలేదు. జీవలక్షణాలు ఉంటే దేహం వస్తుంది. అప్పుడు దేహానికి బట్ట కట్టుకోవాలి. దేహానికి బట్ట ఎటువంటిదో జీవుడికి కూడా దేహం అటువంటిదే. అదే జీవుడు దేహాలు మారుతూ ఉంటాయి. అదే విధంగా అదే దేహం బట్టలు ఎన్ని మారిపోతున్నాయో.

స్వప్నంలో జరిగిన విషయాలు అన్నీ అసత్యం అని మెలుకువ వచ్చాక మీకు తెలుస్తోంది. అలాగే మీకు ఆత్మానుభవం కలిగితే ఈ జన్మలు, ఈ లోకం అంతా అసత్యం అని మీకు తెలుస్తుంది. చావు పుట్టుకలు లేవని

జ్ఞానం కలిగాక నీకు తెలుస్తుంది. ఎంతో స్పష్టంగా, సూటిగా చెపుతున్నారు. అర్హత ఉన్నవారు పట్టుకోండి. అర్హత లేనివారు బెంగపెట్టుకోవద్దు. అర్హత సంపాదించుకోండి. కళ్ళు మూయటం తేలికే గాని మనస్సు అనే కన్నును మీరు మూయలేరు. కన్ను మూసుకోండి అంటే తేలికగానే మూసుకొంటారు. మనస్సు అనే కన్నును మూయండి మీకు జ్ఞానం కలుగుతుంది అంటే ఆ మనస్సు అనే కన్నును మీరు మూయలేరు. దానికి సాధన అవసరం. భౌతికమైన నోరు మూయమంటే, నేత్రం మూయమంటే తొందరగా మూసేస్తారు. మనస్సుయొక్క నోరు మూయటం, మనస్సుయొక్క కన్ను మూయటం అంత తేలిక కాదు. నీ మనోనేత్రం ఎప్పుడైతే మూతపడిందో, నీ మనస్సుయొక్క నోరు ఎప్పుడైతే మూతపడిందో అప్పుడు మనస్సు అంతర్ముఖం అయ్యి చైతన్య ప్రవంతిలో ఐక్యమవుతుంది.

ఏ సాధనలు చేసినా, ఎక్కడ మొదలు పెట్టినా అన్నీ విచారణ మార్గంలో ముగియాలి అని మీరు అప్పుడప్పుడు అక్కడక్కడ అంటున్నారు. విచారణ మార్గం గొప్పతనం ఎత్తి చూపిస్తున్నారు. ఎవరు ఏ మార్గంలో ప్రయాణించినా అన్ని మార్గములు విచారణ మార్గం దగ్గరకు రావలసిందే. నేను అణిగితే గానీ జ్ఞానం రాదు అని మీరు చెపుతున్నారు అని భగవాన్‌తో అంటున్నారు. మీరు ఏ మార్గంలో ప్రయాణించినా మీకు జ్ఞానం కలుగవలసిందే అంటున్నారు భగవాన్. మీఇంట్లో కూరలు, పప్పు, బియ్యం, నీరు అన్నీ ఉన్నా నిప్పు లేకపోతే వంట అవ్వదు. అలాగే మీరు ఎన్ని సాధనలు చేసినప్పటికీ చివరకు జ్ఞానం లేకపోతే మీకు మోక్షం రాదు. ఇతర మార్గాలలో కొంత బేధబుద్ధి ఉంటుంది. బేదబుద్ధి నశిస్తేనే గాని బ్రహ్మం ఎరుకపడదు. జ్ఞానిలో బేదబుద్ధి ఉండదు. ఒక్కజ్ఞాని మాత్రమే నా స్వరూపాన్ని పొందుతాడు అని భగవంతుడు చెప్పాడు. ఎవరికైతే జ్ఞానం కలిగిందో వారికి భగవంతుడు ప్రత్యక్షం అవుతాడు. దేవుడు ఉన్నాడు. దేవుడు నిజంగా ఉన్నప్పటికీ వాడు నీకు అనుభవంలో లేకపోతే వాడివలన నీకు ప్రయోజనం ఏమిటి? ఏ వస్తువునయితే నేను ప్రత్యక్షంగా అనుభవిస్తున్నానో దానివలన నాకు ఉపకారం, సుఖం, శాంతి ఉంది గాని పరోక్షంగా ఉన్న వస్తువు వలన నీకు ఉపకారం లేదు. దేవుడుకి సంబంధించిన అనుభవం లేకుండా దేవుడు ఉన్నాడని అనటం వలన నీకు శాంతి దొరకదు. ఒకవేళ ఉన్నాడు అనుకో పరోక్షంగా ఉన్నవాడి వలన నీకు సుఖం ఏమిటి? వాడిని నీ హృదయంలో ప్రత్యక్షంగా అనుభవించాలి.

వ్యర్థమైన మాటలతో, పనులతో, కోరికలతో కాలాన్ని పాడుచేసుకోవద్దు. భగవంతుడు కాలరూపంలో ఉన్నాడు. కాలాన్ని దుర్వినియోగం చేస్తే భగవంతుని అగౌరవపరచినట్లే. డబ్బు పోతే సంపాదించుకోవచ్చు. కాని గడిచిపోయిన రోజులు రమ్మంటే తిరిగి రావు. జరిగిపోయిన గొడవలు వదిలివేయండి. చావుని మర్చిపోవద్దు. చావు మిమ్మల్ని తరుముకొంటూ వస్తోంది. చావు వచ్చినప్పుడు సాధన మొదలుపెడితే కుదరదు. ఇప్పటినుండి మీరు సాధన చేసి చావుని face చేయటానికి రెడీగా ఉండండి. మీకు ఇష్టం ఉన్నా లేకపోయినా మీరు కాని దానిలో నుండి విడిపోవాలి. చావు వచ్చినపుడు శరీరం నుండి విడిపోవాలి. నీవు వేరు, నేను వేరు అని అనుకొని భక్తుడు భగవంతుని ప్రార్థించటం మొదలుపెడతాడు. అలా ప్రార్థించగా, ప్రార్థించగా అంతా నీవే నేను లేను అన్నసంగతి వాడికి తెలుస్తుంది. అక్కడ కూడా ఈ నేనును పోగట్టుకోవలసిందే. భగవంతుడిని జపించగా, జపించగా ఆ జపించే నేను లేదని కొంతకాలానికి తెలుస్తుంది.

గాఢనిద్రలో మీరు ఒకటిగానే ఉన్నారు. రెండు అనే భావన మనస్సు వచ్చాక వస్తోంది. నీ దేహాన్ని, దేవుడిని, లోకాన్ని మనస్సే కల్పించింది. పూర్వజన్మలో దేహం ఇలా ఉండాలి అని ఊహించటం వలన, ఆ సంకల్పాల వలన ఇప్పుడు నీ దేహం ఇలా తయారయ్యింది. దీనికి దేవుడు కారణం కాదు, ఇతరులు కారణం కాదు. మనస్సు అనే గడప దాటితే ఏమీ లేదు. జగత్తు, జీవుడు , దేవుడు కూడా మనస్సు ఉదయించాక వస్తున్నాయి. మనస్సు నశిస్తే ఇవి కూడా నశిస్తాయి. నది సముద్రంలో కలిసే వరకూ ప్రవహిస్తూనే ఉంటుంది. ఎక్కడా ఆగదు. ఈశ్వరుడిలో ఐక్యం అవ్వటం కోసం నీ సాధన నదీ ప్రవాహంలాగ ఉండాలి.

★